


"పేపర్... పేపర్... పేపర్... ఈరోజు తాజావార్త గల్ఫ్ యుద్ధంలో ఐదువందల మంది ఆహుతి " పేపరు కుర్రాడు అరుస్తూ ఎక్స్‌ప్రెస్ రైలులాగా అటూ ఇటూ తిరుగుతున్నాడు రైల్వే ప్లాట్‌ఫారం పైన.

ఎంతో క్రిక్కిరిసి ఉన్నప్పటికి అప్పుడే ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంపై వచ్చి నిలిచిన రైలు బండినెక్కి కిటికీ ప్రక్కవాని ప్రక్కన "ఉహ్... ఉహ్..." అంటూ చెమటను తువ్వాలతో తుడ్చుకుంటూ కూర్చున్నాడు వీరారావు.

రైళ్ళ కూతలు, కూలీల కూతలు, క్యాంటీన్ కుర్రాళ్ళ కేకలు పందడిగా ఉన్న జనాల అరుపులు, అనౌన్స్‌మెంట్లు, ధ్వనికి ప్రతిధ్వని అన్నీ పోటీపడి సృష్టిస్తున్నాయి ఆకాశాన్ని అందుకునే శబ్దాన్ని.

"పేపర్... పేపర్..." ఇంత శబ్దంలో గూడా పేపర్ బాయ్ గొంతుమాత్రం స్పష్టంగా వినబడు తోంది.

"ఏ! పేపర్ బాయ్" కిటికీలోంచి తొంగి పిలిచాడు వీరారావు. కాని వాడు అప్పటికే ఎన్నో కంపార్టుమెంట్లు దాటి వెళ్ళిపోయాడు.

సామానులు సదిరిపెడుతూ ఉండగా...

"పేపర్... పేపర్..." మళ్ళీ ఆ పేపర్ బాయ్ గొంతువినబడింది. "ఏరా? నీకు పేపరు అమ్మే ఉద్దేశము లేదా? కేకలు వేస్తూ అటూ ఇటూ ఉరకడం తప్ప" అని పేపర్ బాయ్‌ను చివాట్లు పెట్టి, తెలుగు పేపరు కొనుక్కొని తన సీట్లో కూర్చోబోతుండగా...

"సార్! ఓసారి ఆ మధ్య పేపరిస్తారా" ఎదురుగా కూర్చున్న వ్యక్తి అడిగాడు ధీమాగా.

'రూపాయిపెట్టి పేపరు కొనుక్కోలేడుగాని మధ్య పేజీ కావాలట' తనలో తాను గొణుక్కుంటూ మధ్య పేపరు ఇచ్చాడు వీరారావు.

'ఆఫ్ట్రాల్ ఒక్కరూపాయి పేపరుకు ఏడుక్కోవ డం దేనికో?' మనసులోనే అనుకుంటూ పేపర్ అందుకున్నాడు. ఎదుటి వ్యక్తి కనీసం కృతజ్ఞతలు గూడా లేకుండా... మొదటి పేజీలోని హెడ్‌లైన్ చదువాలని పేపరు తిరిగేశాడు వీరారావు అంతే...

తన చూపుకూ పేపర్‌కూ మధ్య తల దూర్చి ర్యాకెట్‌లాగా చదవసాగాడు కుడివైపు కూర్చున కురాడు.

దాంతో మరికాస్త ఏపిగెత్తిపోయాడు వీరారావు

"తీసుకోబాబు" అంటూ ఫ్రంటు పేజీని కోపంగా అందించాడు కుడిప్రక్క కుర్రాడికి అందులోని స్పెషల్ పేపర్ వేరు చేస్తూ.

దృష్టిని గూడా మరల్చకుండా పేపరు అలాగే చదువుతూ ఫ్రంటు పేజీ తీసేసుకున్నాడు ఆ కుర్రాడు.

ఇంతలో

"ఆ స్పెషల్ పేపర్ ఇస్తారా సార్!" వీరారావు చేతిలో ఉన్న పేపరు తీసేసుకున్నాడు ఎడం ప్రక్క కూర్చున్న ఓ లావుపాటి మనిషి.

వీరారావు కోపం అదుపుతప్పే పరిస్థితికి వచ్చింది. కాని ఏం చేయగలడు? 'అఫ్ట్రాల్ ఒక్కరుపాయితో న్యూస్ పేపర్ కొనుక్కోలేరా?' అని ఏడుక్కోవడం, గొణుక్కోవడం తప్ప.

"ఆ మధ్యపేజీలోని సింగిల్ పేపరిస్తారా సార్" నేనేమీ తక్కువా! అన్నట్టుగా బర్తుపై పడుకున్న ఓ మిల్ట్రి సోల్జర్ మధ్య పేజీలు తీసుకున్నవాడి దగ్గర్నుండి సింగిల్ పేపర్ తీసుకుని చదవసాగాడు.

ఆవేశం, ఆలోచనలు, విసుగు అన్ని ఆవరించుకు న్నాయి వీరారావుకు. చెట్లు, గుట్టలూ పరుగిడుతున్న దృశ్యాలను చూస్తూ వెనకకు వాలిపోయాడు పాపం వీరారావు.

దిగవలసిన స్టేషన్ రానే వచ్చింది. రైలు కుదుపుతో ఆలోచనల నుండి బయట బడి, త్వరత్వరగా సూట్‌కేస్, బ్యాగు, చేతబట్టి, తనపేపరు కోసం ప్రక్కవాళ్ళను వాకబుచేసాడు.

కాని, ఏ ఒక్కడి చేతుల్లోను పేపరు ఉన్నట్ల కనబడలేదు చేతులు మారి ఎంతో దూరం వెళ్ళిపోయి ఉంటాయనీ చిటికలోనే గ్రహించ గలిగాడు.

వీళ్ళను ఏ పదాలతో సంబోధించాలో తెలియక తనకు తాను తిట్టుకుంటూ హడావుడిగా రైలు దిగి ప్లాట్‌ఫారం పైన నడవసాగాడు వీరారావు.

రైలు మెల్లిమెల్లిగా కదిలింది.

హఠాత్తుగా కిటికీలోంచి ముద్దగా చేయబడిన ఓ కాగితం ముఖానికి తగిలి క్రిందబడింది.

అక్షరాలను గమనించి తానుకొన్న పేపరేవ కాకుండా, ఎవరో బెంచీతుడిచి బయటపడేసి ఉంటార గ్రహించగలిగాడు వీరారావు

ఎందుకంటే ఇది ఆఫ్ట్రాల్ ఒక్కరూపాయి న్యూస్‌పేపర్ గనక.

లక్కాకుల నర్సింగరావ